సాక్షి
పెద్దపల్లి
శుక్రవారం ׀ 20 ׀ జూన్ ׀ 2025



రైతు భరోసా పంపిణీ
10లో▸

జిల్లాలోని రైతుల ఖాతాల్లో రైతు భరోసా పెట్టుబడి సాయం జమైంది. ఈ సందర్భంగా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

మందుపాతరల గణేశ్



గోదావరి పరివాహక ప్రాంతంలోని నల్లరేగడి భూముల్లో నక్సల్బరి విత్తనాలు మొలకెత్తిన తొలినాళ్లలో వరంగల్ రాడికల్ యువజన సంఘం ఉద్యమాల నుంచి అడవిబాట పట్టిన గాజర్ల రవి ఉరఫ్ గణేశ్ చిన్నవయసులోనే పలు విధ్వంసాలు సృష్టించి కేంద్ర కమిటీ మన్ననలు పొందారు.
10లో▸

గరిష్ఠం/కనిష్ఠం
37.0/25.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ వేడిమి పెరుగుతుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

చట్టాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న స్వప్నరాణి

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): ప్రతీఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా లీగల్ అథారిటీ సెక్రటరీ స్వప్నరాణి అన్నారు. మండలంలోని నీరుకుల్లలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, అలాంటి పిల్లలను తల్లిదండ్రులు ఓ కంట కనిపెట్టాలన్నారు. నిరుపేదలు ఉచిత న్యాయ సేవలను ఆయా కోర్టుల్లో ఉపయోగించుకోవచ్చని వివరించారు. న్యాయవాదులు శరత్‌కుమార్, భాను కృష్ణ, ఝాన్సీ, గ్రామ స్పెషల్ అధికారి సచిన్, కార్యదర్శి సునీత, గ్రామస్తులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవాన్ని సక్సెస్ చేయాలి
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి



వాకర్స్‌తో మాట్లాడుతున్న సంజీవరెడ్డి

పెద్దపల్లి రూరల్: ప్రపంచ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఐటీఐ గ్రౌండ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బీజేపీ ఆధ్వర్యంలో శనివారం యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట చక్రధర్ రెడ్డి, శ్రీనివాసరావు, గోపి, దిలీప్ రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం



చిన్నారులతో చందన

పెద్దపల్లిరూరల్: రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం లభిస్తుందని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు ఎం.చందన అన్నారు. పట్టణంలోని 8వ సెంటర్ తెనుగువాడలోని అంగన్‌వాడీ సెంటర్‌ను గురువారం ఆమె సందర్శించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పిల్లలకు ప్రీస్కూల్ విద్య, పోషకాహారం, ఆరోగ్య సంరక్షణలో సేవలందిస్తున్నాయన్నారు. జిల్లా సంక్షేమశాఖ అధికారి వేణుగోపాల్, సీడీపీవో కవిత, సూపర్‌వైజర్ ప్రేమలత, టీచర్లు స్వరూప, రేఖ, రజిత, సుజాత పాల్గొన్నారు.

క్షయరహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి



వైద్యుడిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా ప్రోగ్రాం అధికారి

ముత్తారం: క్షయరహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని టీబీ అలర్ట్ ఇండియా జిల్లా పోగ్రాం అధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం ముత్తారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. మండలంలోని ఐదు సబ్ ఆరోగ్యకేంద్రాల్లో క్షయవ్యాధి గురించి అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రెండు వారాలు దగ్గు ఉన్నట్లయితే తెమడ పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి లక్షణాలు, నివారణపై స్థానికులకు అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట ముత్తారం ప్రభుత్వ వైద్యుడు అమరేందర్‌రావు, తదితరులున్నారు.

బకాయిల బండ

- జిల్లాలో భారీగా పేరుకుపోయిన విద్యుత్ బకాయిలు
- వసూలు కాని బిల్లులు రూ.3,728.48 కోట్లు
- నీటిపారుదల ప్రాజెక్టుల నుంచి రావల్సినవే ఎక్కువ



ఎక్కువ మొత్తంలో బకాయిలతో నిలిచిన రామగుండం కమిషనరేట్ కార్యాలయం



కలెక్టరేట్

సాక్షి, పెద్దపల్లి: నిరుపేదల ఒక్క నెల బిల్లు చెల్లించకపోతేనే కనెక్షన్ తొలగించే విద్యుత్ అధికారులు.. ప్రభుత్వ శాఖల నుంచి బకాయిల వసూళ్లను పట్టించుకోవడం లేదు. వేలకోట్లు బకాయిల గుదిబండగా మారినా వసూళ్లపై దృష్టి పెట్టడం లేదు. జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టుల వాటా అత్యధికంగా ఉంది. జిల్లాలో విద్యుత్ బకాయిల భారం రూ.3,728.48కోట్లకు చేరింది. ఇంత భారీగా బకాయిలు పడ్డ వసూలుకు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

21 శాఖలు... రూ.31.48కోట్లు

జిల్లా వ్యాప్తంగా ఉన్న 21 ప్రభుత్వ శాఖలు కలిపి రూ.31.48కోట్లు విద్యుత్ బకాయిలున్నాయి. అత్యధికంగా గ్రామపంచాయతీలు రూ.19.72 కోట్లు బకాయిలుండగా, మున్సిపాలిటీలు రూ.3.70 కోట్లు, మెడికల్ కాలేజీ రూ.2.1 కోట్లు, వైద్యా విధాన్‌పరిషత్ రూ1.4 కోట్లు బకాయిలు పడ్డాయి.

ఇరిగేషన్ నుంచే అత్యధికం

జిల్లాలో కాళేశ్వరం ప్రాజెక్టు కింద నిర్మించిన బ్యారేజీలు, పంపుహౌస్‌లకు సంబంధించిన విద్యుత్ బకాయిలు అధికంగా ఉన్నాయి. నందిమేడారం పంప్‌హౌస్‌కు సంబంధించి రూ.2,672కోట్లు, అంతర్గాం మండలం గోలివాడ పంప్‌హౌస్‌కు రూ.564కోట్లు, సుందిళ్ల పంప్‌హౌస్‌కు సంబంధించి రూ.406 కోట్ల విద్యుత్ బకాయిలు ఉన్నాయి. మొత్తంగా కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి రూ.2,978కోట్లు పెండింగ్ బిల్లులు ఉన్నాయి. వీటితోపాటు ఎల్లంపల్లి, ఇతర మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించి రూ.426 కోట్లు బకాయిలు ఉన్నాయి. మొత్తంగా నీటిపారుదలశాఖ ప్రాజెక్టులకు సంబంధించి రూ.3,404కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

హెచ్‌టీ కనెక్షన్ల బకాయిలు రూ.293 కోట్లు

ఎక్కువ విద్యుత్ లోడ్ అవసరమైన హెచ్‌టీ కనెక్షన్లు గల ప్రభుత్వ కార్యాలయాల్లోనూ అదే స్థాయిలో బకాయిలున్నాయి. ప్రధానంగా జిల్లా సమీకృత కలెక్టరేట్ రూ.38లక్షలు, రామగుండం పోలీస్ కమిషనరేట్ రూ.29లక్షలు, మెడికల్ కాలేజీ స్టేజ్–2కు సంబంధించి రూ.76లక్షలు ఉన్నాయి. మొత్తంగా హెచ్‌టీ కనెక్షన్లకు సంబంధించి రూ.293కోట్లు బకాయిలున్నాయి.

బిల్లుల విషయమై చెబుతున్నాం



కొన్ని ప్రభుత్వ శాఖలు విద్యుత్ బకాయిలను నెలలతరబడి చెల్లించడం లేదు. వాటిపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రతీ నెల నోటీసలు అందిస్తున్నాం. కార్యాలయాల నిర్వహణకు నిధులు విడుదలవడంతోనే కొన్ని శాఖల అధికారులు ఒకేసారి చెల్లిస్తున్నారు. వినియోగదారులకు ఎక్కువ ఇబ్బంది కలుగకుండా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నాం.

– మాధవరావు, ఎస్‌ఈ

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



కలెక్టరేట్‌లో అధికారులతో రివ్యూ నిర్వహిస్తున్న కలెక్టర్ కోయ శ్రీ హర్ష

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి రూరల్/సుల్తానాబాద్: ప్రభుత్వ ఆస్పత్రులు, పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. అభివృద్ధి పనులపై కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో గురువారం సమీక్షించారు. రామగుండం జెడ్పీహెచ్‌ఎస్‌కు రూ.40 లక్షల సీఎస్సార్ నిధులు ఉన్నాయని, పనులు ప్రారంభించాలని అన్నారు. ఇందుకు స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ తీర్మానాలు తీసుకోవాలని అన్నారు. జూనియర్ కళాశాల అభివృద్ధికి నిధులు ఉన్నందున వారంరోజుల్లో పనులు ప్రారంభించాలన్నారు. జిల్లాకేంద్ర ఆసుపత్రి పనులు గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. గోదావరిఖని జనరల్ ఆసుపత్రి ఫస్ట్ ఫ్లోర్ మరమ్మతు పూర్తి చేసినట్లు సర్టిఫికెట్ సమర్పిస్తే చెల్లింపులు పూర్తి చేస్తామని తెలిపారు. జీజీహెచ్ గ్రౌండ్ ఫ్లోర్‌లో రూ.98 లక్షలతో మరమ్మతు చేపట్టామన్నారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు

సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. డయేరియా నియంత్రణపై కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. ఐదేళ్లలోపు పిల్లల్లో డయేరియా నియంత్రణకు తీసుకునే చర్యలపై డీఎంహెచ్‌వో వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో శుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. డ్రైనేజీల్లో ఆయిల్ బాల్స్ వేయాలని అన్నారు. గురుకులాలు, హాస్టళ్లలో వ్యాధులు త్వరగా వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది రెగ్యులర్‌గా విజిట్ చేయాలని సూచించారు. గ్రామాల్లో ఫాగింగ్ చేపట్టాలన్నారు. రామగుండం ప్రాంతంలో మరింత సమర్థవంతంగా వైద్య సేవలు అందించాలన్నారు. క్రిటికల్ కేసులను గోదావరిఖని జనరల్ ఆసుపత్రికి రెఫర్ చేయాలని తెలిపారు. డయాబెటిస్‌ను తేలికగా తీసుకుంటే వచ్చే నష్టాలను ప్రజలకు వివరించాలన్నారు. అనుమతి లేకుండా వైద్యులు, నర్సు, ఏఎన్‌ఎంలు గైర్హాజరు కావద్దన్నారు. కార్యక్రమాల్లో డీఎంహెచ్‌వో అన్నప్రసన్న కుమారి, అధికారులు పాల్గొన్నారు.

21న యోగా దినోత్సవం

ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆయూష్ విభాగం ఆధ్వర్యంలో కూనారం రోడ్డులోని ఆర్‌కే గార్డెన్‌లో కార్యక్రమం నిర్వహిస్తున్నామని, దీనినివిజయవంతం చేయాలని సూచించారు.

గాంధీ కుటుంబానికే దేశాన్ని పాలించే సత్తా



కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్: గాంధీ కుటుంబానికే దేశాన్ని పాలించే సత్తా ఉందని పెద్దపల్లి శాసన సభ్యుడు చింతకుంట విజయరమణారావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని నెహ్రూ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇటీవల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పాకిస్తాన్‌తో యుద్ధం విషయంలో అవలంబించిన ధోరణి యావత్తు దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా చేపట్టిన జూడో యాత్రతో ఆయన పరిణతి చెందిన విధానం, నిబద్ధత, అంకుటిత దీక్ష, సత్తా దేశ ప్రజలందరూ గమనించారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణలో కుల గణన చేపట్టి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్యగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, మాజీ మార్కెట్ చైర్మన్ సాయిరి మహేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిలుక సతీశ్, వేగోళం అబ్బయ్యగౌడ్, డి.దామోదర్ రావు, కుమార్ కిషోర్, పన్నాల రాములు, బిరుదు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించాలి

- జెడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధుకర్
- అంతర్ జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం



ప్రారంభిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

పాలకుర్తి: క్రీడలతో శారీరక ధారుడ్యంతోపాటు మానసికోల్లాసం కలుగుతుందని, స్నేహభావం పెంపొందుతుందని పెద్దపల్లి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పుట్ట మధుకర్ పేర్కొన్నారు. బసంత్‌నగర్‌లో ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి తండ్రి సత్యనారాయణ స్మారకార్థం ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్‌జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు కౌశిక హరి, బీఆర్‌ఎస్ నాయకురాలు దాసరి ఉష, బీజేపీ నాయకురాలు కందుల సంధ్యారాణి, కేశోరాం ప్లాంట్ హెడ్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత.. తర్వాతే బిల్లుల చెల్లింపు

కోల్‌సిటీ(రామగుండం): అభివృద్ధి పనుల్లో నాణ్యత నిర్ధారించిన తర్వాతే కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపు ఉంటుందని నగరపాలక సంస్థ కమిషనర్ జె.అరుణశ్రీ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. నగరపాలక సంస్థ సాధారణ నిధులతోపాటు వివిధ పథకాలతో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించి అంచనా వ్యయంపై 25శాతం కన్నా మించి లెస్ టెండర్ వేస్తే థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్‌కు తోడు ఇతర ఇంజినీరింగ్ శాఖల అధికారులతో పరీక్షలు నిర్వహిస్తారన్నారు. నాణ్యత నిర్ధారించుకున్న తర్వాతే కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లించనున్నట్లు స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ రిజిస్టర్డ్ కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించి ఈ షరతును వివరించడంతోపాటు అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతీఒక్కరి బాధ్యత

- ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజ్‌ఠాకూర్



ఎక్స్‌కవేటర్‌ను ప్రారంభిస్తున్న రాజ్‌ఠాకూర్

కోల్‌సిటీ(రామగుండం): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతీఒక్కరి బాధ్యత అని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ అన్నారు. 15వ ఆర్థిక సంఘం టైడ్ నిధులు రూ.30లక్షల అంచనా వ్యయంతో కొనుగోలు చేసిన జేసీబీ మినీ ఎక్స్‌కవేటర్ యంత్రాన్ని, బల్దియా కార్యాలయంలో కమిషనర్ (ఎఫ్‌ఏసీ) జె.అరుణశ్రీతో కలిసి గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రమైన సుందరనగరంగా తీర్చిదిద్దే క్రమంలో, పారిశుద్ధ్య నిర్వహణ పటిష్టంగా చేపట్టడానికి ఆధునిక యంత్రాలు కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాలువలు, రోడ్లపై చెత్త వేయొద్దని, మున్సిపల్ వాహనాలకు చెత్త అందించి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీవీ రామన్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి, మాజీ కార్పొరేటర్లు మహంకాళిస్వామి పాల్గొన్నారు.

పారదర్శకం.. ఇందిరమ్మ పథకం

రామగుండం: ప్రజాపాలనలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ పథకం పారదర్శకంగా అమలు చేస్తామని, నిర్దేశిత గడువులోగా ఇంటి నిర్మాణం చేపడితే దశల వారీగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాకు డబ్బులు జమవుతాయని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ అన్నారు. అంతర్గాం మండల కేంద్రంలో గురువారం 402 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ప్రొసీడింగ్స్, 194 మందికి రేషన్‌కార్డులు అందజేశారు. అంతర్గాం కేంద్రంగా అంతర్జాతీయ ప్రమాణాలతో విమానాశ్రయం నిర్మాణం కానుందన్నారు. పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య, తహసీల్దార్ తూము రవీందర్‌పటేల్, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ ప్రతినిధులు హాజరయ్యారు.

నూతన సబ్ స్టేషన్ ప్రారంభోత్సవం..

అంతర్గాం మండల పరిధిలోలో ఓల్టేజి నివారణలో భాగంగా నూతనంగా 33/11కేవీ సామర్థ్యం గల సబ్ స్టేషన్ నిర్మాణానికి రూ.2.29కోట్ల వ్యయంతో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ శంకుస్థాపన చేశారు. ఎన్పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కంకటి మాధవరావు, డీఈ వి.ప్రభాకర్, ఏడీఈ రమేశ్, ఏఈ ఆశ శంకర్ ఉన్నారు.

ఆపరేషన్ 'మంకీ'!

- వనం వదలి జనంలోకి వస్తున్న వానరాలు
- కోతుల బెడద నివారణకు రూ.10లక్షలు
- బల్దియాలో కోతులను పట్టుకుంటున్న ఏజెన్సీ సిబ్బంది
- అడవులు అంతరించడంతో ఇళ్లలోకి
- సంరక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్



కోతులు పట్టుకునేందుకు ఆహారం వేస్తున్న ఏజెన్సీ సిబ్బంది



సింగరేణి స్టేడియంలో కోతులను బోనులో బంధించిన సిబ్బంది

కోల్‌సిటీ(రామగుండం): వనం వదిలి వానరాలు జనంలోకి వస్తున్నాయి. ఇటీవల రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోకి వందలాది వానరాలు వచ్చి ప్రజలకు భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. కోతుల బెడద అరికట్టాలని ప్రజల నుంచి ఫిర్యాదులు భారీగా రాగా దీంతో బల్దియా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. వారం రోజులుగా వానరులను బంధించి సమీప జిల్లాల్లోని దట్టమైన అడవుల్లో వదిలేస్తున్నారు.

ఇళ్లలోకి చొరబడి

వనాల్లో ఉండాల్సిన కోతులు నగరంలోని జనవాసాల్లోకి చేరి గుంపులు గుంపులుగా తిరుగుతూ జనాలపై దాడి చేస్తున్నాయి. ఇళ్లల్లో చొరబడి వీరంగం సృష్టిస్తున్నాయి. ఇళ్లు, దుకాణాల్లోని తినుబండారాలు, వస్తువులను ఎత్తుకెళ్తున్నాయి. కూరగాయలు, ఇళ్లలోని ఆహార పదార్థాలు, వస్తువులు చిందరవందర చేస్తున్నాయి. కోతుల దాడిలో చాలామంది గాయపడుతున్నారు.

బల్దియాకు ఫిర్యాదులు

నగరంలోని రామగుండం, గాంధీనగర్, తిలక్‌నగర్, రమేశ్‌నగర్, పవర్‌హౌజ్‌కాలనీ, విద్యానగర్, ఐబీ కాలనీ, జవహర్‌నగర్, ఎల్కలపల్లి గేట్, అన్నపూర్ణకాలనీ తదితర ప్రాంతాల్లో కోతుల బెడద తీవ్రంగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోతుల బెడదను అరికట్టాలంటూ బల్దియాకు ఫిర్యాదులు కూడా పెరుగుతున్నాయి.

వానరుల బెడదకు చెక్..

బల్దియాలో వానరుల బెడదకు చెక్ పెట్టేందుకు కలెక్టర్, బల్దియా స్పెషలాఫీసర్ కోయ శ్రీహర్ష ఆదేశాల మేరకు, నగరపాలక కమిషనర్(ఎఫ్‌ఏసీ) జె.అరుణశ్రీ చర్యలు చేపట్టారు. రూ.10లక్షల అంచనాలతో టెండర్ పిలిచిన అధికారులు, హైదరాబాద్‌కు చెందిన ఓ కాంట్రాక్టర్‌కు కోతులను పట్టుకునే పనులు అప్పగించారు.

స్పెషల్ డ్రైవ్..

నగరంలోని డివిజన్లలో కోతులు పట్టుకునేందుకు వారం రోజులుగా టెండర్ పొందిన ఏజెన్సీ ప్రతినిధులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. కోతులు ఎక్కువగా ఉన్న ప్రాంతాన్ని ముందుగా ఎంచుకొని వాటిని బోన్లల్లో బంధిస్తున్నారు. సమీపంలోని చెన్నూరు, కాటారం తదితర దట్టమైన అడవులకు జీపీఆర్ సిస్టం కలిగిన ప్రత్యేక వాహనాల్లో తరలించి వదిలేస్తున్నారు.

కాల్ సెంటర్ ద్వారా ఫిర్యాదులు

నగరంలో కోతుల కట్టడికి బల్దియా అధికారులు కాల్ సెంటర్ 960 3666 444 ద్వారా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్నారు. కోతుల బెడద ఎక్కువగా ప్రాంతాలపై సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు. ప్రతీ రోజూ కోతులను పట్టుకునే ప్రక్రియపై పర్యవేక్షణ చేపట్టేందుకు, సిబ్బందిని కూడా కమిషనర్ ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు.

ఇళ్లల్లోకి చొరబడుతున్నాయి



ఆహారం కోసం కోతులు ఇళ్లల్లో చొరబడి బీభత్సం సృష్టిస్తున్నాయి. ఇంట్లోకి వెళ్లాలంటే భయంగా ఉంది. మార్కండేయ కాలనీలోని రాజ్యలక్ష్మీ ఫంక్షన్‌హాల్ వద్ద కోతులు విపరీతంగా ఉన్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– రాము, గాంధీనగర్–గోదావరిఖని.

అడవులను సంరక్షించాలి



అడవులను సంరక్షించి, పండ్ల మొక్కలు నాటినట్లయితే కోతులు, వనం వదిలి జనంలోకి రావు. కోతుల బెడద నివారణకు అధికారులు రూ.లక్షలు వెచ్చిస్తున్నారు. ఈ డబ్బుతో అడవులు అంతరించిపోకుండా సంరక్షించాలి. అడవుల్లో ఎక్కువగా నీటి గుంతలు నిర్మించాలి.

– పిట్టల రాజ్‌కుమార్, గోదావరిఖని

ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం



నగరంలో కోతుల బెడద నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే రూ.10లక్షలతో టెండర్ పిలిచి, ఓ ఏజెన్సీకి పనులు అప్పగించాం. రోజూ ఎన్ని కోతులు పట్టి తిరిగి ఎక్కడ వదిలేస్తున్నారన్న దానిపై పర్యవేక్షణ చేపడుతున్నాం. కాల్ సెంటర్‌లో ఫిర్యాదులు అందించాలి.

– జె.అరుణశ్రీ, బల్దియా కమిషనర్ (ఎఫ్‌ఏసీ)

బాల్య వివాహాలు నివారించాలి



మాట్లాడుతున్న చందన

పెద్దపల్లిరూరల్: బాల్య వివాహాలు నివారించాలని, వచ్చే ఏడాది మార్చినాటికి పెద్దపల్లిని బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు ఎం.చందన సూచించారు. కలెక్టరేట్‌లో బాలల హక్కుల సంరక్షణపై సంబంధిత అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహాలను నివారించేందుకు అధికారులు అద్భుతంగా పని చేస్తున్నారని, మార్చి 2026 నాటికి బాల్య వివాహాల రహిత జిల్లాగా పెద్దపల్లి ప్రకటించాలని, ఆ దిశగా అధికారులు కృషి చేయాలన్నారు. గర్భస్థ శిశులింగ నిర్ధారణ నిషేధ చట్టం జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు.

ఆపరేషన్ ముస్కాన్..

ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం కింద బాల కార్మికులు పనిచేసే పిల్లలను గుర్తించి వారికి సరైన పునరావాసం కల్పించాలన్నారు. పిల్లలపై జరిగే అఘాయిత్యాలకు చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీసీపీ కరుణాకర్, జిల్లా సంక్షేమ అధికారి పి.వేణుగోపాల్ రావు, జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అన్నప్రసన్న కుమారి, ఏసీపీలు కృష్ణ, రమేశ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా అనఘాదత్తాత్రేయ వ్రతం

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్‌లోని శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయంలో గురువారం అనఘాదత్తాత్రేయ వ్రతాన్ని దత్త ఉపాసకులు వేణుగోపాల్‌స్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు రాంపల్లి మురళీధర్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు, దత్త భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మద్యంమత్తులో బైక్‌కు నిప్పు



మంటల్లో కాలిపోతున్న బైక్

మల్యాల: మండలంలోని రాజారం శివారులో మద్యం మత్తులో ఓ యువకుడు తన బైక్‌కు నిప్పుపెట్టాడు. దీంతో అది పూర్తిగా కాలిపోయింది. జగిత్యాల మున్సిపాలిటీ పరిధి టీఆర్‌నగర్‌కు చెందిన సలీం గురువారం సాయంత్రం రాజారం శివారులో తన ద్విచక్ర వాహనాన్ని నిలిపాడు. మద్యం మత్తులో దానికి నిప్పు పెట్టాడు. స్థానికుల సమాచారంతో బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ సురేశ్, హోంగార్డు నర్సింగరావు సంఘటనాస్థలానికి చేరుకుని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మంటలు ఆర్పివేశారు.

హత్య కేసులో ఇద్దరికి ఏడేళ్ల జైలు

జగిత్యాలజోన్: మద్యం మత్తులో జరిగిన గొడవలో ఒకరిని హత్య చేసిన కేసులో ఇద్దరికి ఏడేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.3 వేల చొప్పున జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి. రత్న పద్మావతి గురువారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జంగిలి మల్లికార్జున్ కథనం ప్రకారం.. రాయికల్ మండలం ధర్మాజీపేటకు చెందిన సావన్‌వెల్లి రాజుకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు సంతానం. ఇద్దరు కూతుళ్లకు పెళ్లయ్యింది. కొడుకు శేఖర్ వ్యవసాయంతోపాటు గ్రామంలో కూలీ పనులకు వెళ్లేవాడు. అదే గ్రామానికి చెందిన రాస రాజేశం, బలిజే నాగ భూషణంతో పరిచయం ఏర్పడింది. వారితో కలిసి కూలీ పనులకు వెళ్తూ.. వచ్చిన డబ్బులతో అందరూ కలిసి జల్సా చేసేవారు. 22 మార్చి 2022న శేఖర్ ఇంటి వద్ద ఉండగా.. సాయంత్రం 4 గంటల సమయంలో బలిజే నాగభూషణం వచ్చి శేఖర్‌ను ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని వెళ్లాడు. రాత్రి అయినా శేఖర్ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఆయన కోసం వెదుకుతుండగా మరుసటి రోజు గ్రామ శివారులో శేఖర్ శవమై కనిపించాడు. మృతుడి తల్లి రాజు రాయికల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై పి.కిరణ్‌కు మార్ కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ వై.కృష్ణ కుమార్ కేసును దర్యాప్తు చేశారు. మద్యం మత్తులో జరిగిన గొడవలో రాస రాజేశం, బలిజె నాగ భూషణం శేఖర్‌ను హత్య చేసినట్లు తేల్చారు. నిందితులను అరెస్ట్ చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారులు ఎం.కిరణ్‌కుమార్, కె. నరేశ్ కోర్టులో సాక్ష్యాలను ప్రవేశపెట్టగా రాజేశం, నాగభూషణంకు ఏడేళ్ల చొప్పున జైలు, రూ.3వేల చొప్పున జరిమానా విధించారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి గొర్రెల కాపరి మృతి

ధర్మారం: ధర్మారం మండలం నర్సింగపూర్ గ్రామానికి చెందిన పెద్ది మల్లయ్య గురువారం ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మరణించినట్లు ధర్మారం ఎస్సై శీలం లక్ష్మణ్ తెలిపారు. గొర్రెల కాపలాకు వెళ్లిన మల్లయ్య మంచినీరు తాగేందుకు బావి వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి మరణించాడు. మృతుని భార్య పెద్ది పోశవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చూస్తే చిల్లరే.. కోట్లలో దోపిడీ

కరీంనగర్ రాంనగర్‌కు చెందిన శ్రీధర్ రావు బంధువులు వచ్చారని చికెన్ కొందామని మార్కెట్‌కు వెళ్లాడు. పేపర్ ధర(ఆన్‌లైన్ సీఎమ్మార్) ప్రకారం జనరల్ కిలో కోడి ధర రూ.91 ఉండగా కిలో కోడి ధర రూ.120కి విక్రయించారు. పేపర్ రేట్ కదా ఇదేంటంటే గిట్టుబాటు కాదని సమాధానం. పట్టణంలోనే ఇలా ఉంటే గ్రామీణ ప్రాంతాల్లో మరీ దారుణం. ఇది ఒక్క శ్రీధర్ పరిస్థితే కాదు.. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా చికెన్ కొనుగోలు చేసే సగటు వినియోగదారుని పరిస్థితి.



- ధరలు ఇష్టారాజ్యం.. నియంత్రణ పూజ్యం
- వినియోగదారులను దోచుకుంటున్న చికెన్ సెంటర్లు
- దళారులదే రాజ్యం.. పేరుకే పేపర్ రేట్ కానీ అదనమే
- కోళ్ల ఫారం యజమానులకు అంతంతే

గురువారం ధరలిలా

ఫారం దగ్గర కిలో కోడి	రూ.91
చికెన్ సెంటర్‌లో కిలో కోడి	రూ.113
స్కిన్‌తో	రూ.164
స్కిన్‌లెస్	రూ.186

కరీంనగర్ అర్బన్: కోడి కూర .. ఈ పేరు వింటేనే నోరూరుతోంది. సుట్టమొచ్చినా.. సంతోష వేడుకైనా.. విషాదమైనా ముక్కలు ఉడకాల్సిందే. జిల్లాలో వీటి వినియోగం ఎక్కువ. నిత్యం 40 వేల క్వింటాళ్ల చికెన్ అమ్ముడుపోతుండగా.. చికెన్ సెంటర్ల నిర్వాహకులకు కాసుల పంటే. పేరుకు పేపర్ రేటని చెబుతూ వీలైనంత మేర దండుకుంటున్నారు. పేపర్ ధర ఒకటైతే విక్రయించేది మాత్రం కిలోకు రూ.40 అదనం. ఇదేంటంటే మేమింతే..నన్న ఈసడింపు సమాధానం. జిల్లాలో నిత్యం రూ.4.20 కోట్ల వ్యాపారం సాగుతుండగా అదనంగా రూ.1.20 కోట్లు దోచుకుంటున్నారు. ఈ లెక్కన నెలకు రూ.36 కోట్ల మేర వినియోగదారులను పిండేస్తుండగా నియంత్రించే వారే లేకపోవడంతో అడ్డూఅదుపూ లేకుండా పోతోంది.

చికెన్ సెంటర్లు.. దళారులకే లాభం

కోళ్ల పరిశ్రమ స్వయం ఉపాధిగా వెలుగొందుతుండగా దీనిపై ప్రభుత్వానికి ఎలాంటి అధికారం లేదు. హెచరీస్, కోళ్ల ఫారం యజమానులు, ట్రేడర్స్, చికెన్ సెంటర్ల నిర్వాహకులు ఇలా వినియోగదారులకు చికెన్ చేరుతుండగా యజమానుల పరిస్థితి అటుంచితే ట్రేడర్లు, చికెన్ సెంటర్ల నిర్వాహకులే ధరలను శాసిస్తున్నారు. సొమ్మొకడిది సోకొకరిదన్నట్లు గంటల వ్యవధిలోనే లాభాలు గడిస్తున్నారు ట్రేడర్లు. పుట్టగొడుగుల్లా ట్రేడర్లు పుట్టుకొస్తుండగా.. చికెన్ సెంటర్లు ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్నాయి. జిల్లాలో సుమారు 10 వేలకు పైగా చికెన్ సెంటర్లు ఉండగా ట్రేడర్లు సుమారు 500లకు పైగా ఉన్నారు. కోళ్ల ఫారం యజమానుల నుంచి ఆన్‌లైన్ సీఎమ్మార్ ధరల ప్రకారం కొనుగోలు చేస్తున్నారు. ఉదాహరణకు కిలో కోడి ధర రూ.90 ఉంటే మైనస్ 5, మైనస్ 10కి తక్కువగా కొనుగోలు చేస్తూ చికెన్ సెంటర్ నిర్వాహకులకు రూ.90కి అదనంగా రూ.5, 10కి ఎక్కువగా రవాణా పేరుతో విక్రయిస్తున్నారు. అంటే కిలో కోడికి రవాణా ఖర్చులు పోనూ రూ.15కు అదనంగా విక్రయిస్తున్నారు. ఒక ట్రాలీ ఆటో జాలీలో 300–800ల వరకు కోళ్లను సరఫరా చేస్తారు. ఒక కోడి యావరేజ్‌గా 2.300 కిలోలున్నా.. రూ.30 వేల వరకు ఆర్జిస్తున్నారు. ఇదిలా ఉంటే చికెన్ సెంటర్ల నిర్వాహకులు ట్రేడర్ సరఫరా చేసిన ధరకు రూ.5–10కి ఎక్కువ విక్రయించాలి. కానీ.. ఆచరణలో రూ.30–40వరకు ఎక్కువకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

పుట్టగొడుగుల్లా ట్రేడర్లు

జిల్లాలో పౌల్ట్రీఫాంల నుంచి కోళ్లను కొనుగోలు చేసి చికెన్ సెంటర్లకు సరఫరా చేసేవారి సంఖ్య క్రమేణా పెరుగుతోంది. దీంతోనే ఎక్కువ లాభం ఉండటం.. మైనస్ మంత్రాన్ని జపించడంతో అనతికాలంలో లక్షలు వెనకేస్తున్నారు. ఈ జాబితాలో కోళ్ల ఫారం యజమానులు చేరిపోతున్నారు. ఫారం ద్వారా వచ్చే ఆదాయం కంటే సరఫరా చేస్తే వచ్చే ఆదాయం ఎక్కువగా ఉండగా అదీ రెండు, మూడు రోజుల్లోనే వస్తుండటంతో ఈ వ్యాపారం వైపే మొగ్గుచూపుతున్నారు.

పాపం.. కోళ్ల ఫారం యజమానులు

ట్రేడర్లు, చికెన్ సెంటర్ నిర్వాహకులు, హెచరీస్‌లు వీలైనంత సంపాదిస్తుంటే కోళ్ల ఫారం యజమానులది దారుణ పరిస్థితి. రోజుల వ్యవధిలోనే వారంతా లాభాలు గణనీయంగా పొందుతుంటే పిల్లల నుంచి కోళ్ల వరకు రూపాంతరం చెందే వరకు శ్రమించే యజమానులకు మాత్రం మిగిలేది చిన్న మొత్తమే. జిల్లాలో సుమారు 4 వేల వరకు కోళ్ల ఫారాలున్నాయి. హెచరీస్‌లు కోడి పిల్లలను కోళ్ల ఫాం యజమానులకు సరఫరా చేస్తుండగా 40–45 రోజులకు పెంచి వాటిని సంరక్షించడం చేసే ప్రక్రియ. ఇక దాణా సరఫరా చేసే కంపెనీలు బస్తాలపై ఎలాంటి ముద్రణలు చేయడం లేదు. కేవలం కంపెనీ పేరు మాత్రమే ఉంటుండగా దాణాలో వాడే ముడి పదార్థాలను పేర్కొనడం లేదు. ధర ఉండటం లేదు. కంపెనీని నమ్ముకుని దాణా వేయడమే. ఈ లోపు ఏదైనా వైరస్ వచ్చినా.. మొటలిటీ (మరణించడం) జరిగినా రైతు పైనే భారం. ఇవన్నీ తట్టుకుని కోళ్లను విక్రయించే సమయానికి ట్రేడర్ల దోపిడీ అధికమవుతోంది. దీంతో చేసేదీలేక మైనస్‌లకు విక్రయిస్తూ పెట్టిన పెట్టుబడిలో పావు వంతు కూడా లాభం పొందడం లేదు. కోళ్ల పరిశ్రమను నమ్ముకున్నవారికి ఆశించిన ప్రయోజనం లేదని ఫారం యజమానులు వాపోతున్నారు.

పౌల్ట్రీ మీట్ ఫెడరేషనే మార్గం

కోళ్ల పరిశ్రమపై ఒకప్పుడు ప్రభుత్వ పర్యవేక్షణ ఉండేది. ఫారం యజమానులు నష్టపోయినా, ఏవైనా విపత్తులు సంభవించినా అరకొర సాయమందేది. దీనికి తోడు ప్రభుత్వ రాయితీలుండేవి. ప్రభుత్వ కనుసన్నలో 1985 వరకు పౌల్ట్రీ మీట్ ఫెడరేషన్ ఉండేది. కాలక్రమేణ ఫెడరేషన్ కనుమరుగైంది. నిరుద్యోగ యువతకు ఇదో చక్కని అవకాశమే కానీ... సంస్కరణలు అవసరమన్నది యజమానుల వాదన. కాగా... కోళ్ల పరిశ్రమ స్వయం ప్రతిపత్తి గల ప్రైవేట్ రంగం. వీటి ధరలపై మాకెలాంటి అధికారం లేదు. ప్రభుత్వం నుంచి ఎలాంటి రాయితీలు, ప్రోత్సాహకాలు లేవని పశుసంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు.

కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి



మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

జ్యోతినగర్(రామగుండం): పరిశ్రమల్లో విధులు నిర్వహించే కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని ఐఎన్టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శి బాబర్ సలీంపాషా డిమాండ్ చేశారు. ఎన్టీపీసీ రామగుండం పర్మినెంట్ టౌన్‌షిప్ యూనియన్ కార్యాలయంలో జులై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను కార్మికవర్గం విజయవంతం చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 23న యాజమాన్యాలకు సమ్మె నోటీసు అందించనున్నట్లు పేర్కొన్నారు. జాతీయ సంఘాల ఆధ్వర్యంలో జులై9న దేశవ్యాప్తంగా 13వ సారి జరగనున్న సమ్మెలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జేఏసీ నాయకులు ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు భూమల్ల చందర్, నాంసాని శంకర్, చిలుక శంకర్, రెడపాక లక్ష్మణ్, నాగభూషణం, గీట్ల లక్ష్మారెడ్డి, బొద్దున రాజేశం, ఎన్టీపీసీ మజ్దూర్ యూనియన్ నాయకులు ఆరెపల్లి రాజేశ్వర్, వేముల కృష్ణయ్య పాల్గొన్నారు.

స్వగ్రామానికి మృతదేహం



లచ్చన్న (ఫైల్)

పెగడపల్లి: ఉపాధి కోసం దుబాయి వెళ్లి ఆత్మహత్య చేసుకున్న ఓ వలసజీవి మృతదేహం గురువారం స్వగ్రామానికి చేరింది. మండలంలోని బతికపల్లికి చెందిన పూడూరి లచ్చన్న (46) జీవనోపాధి కోసం దుబాయి వెళ్లాడు. తాను పని చేస్తున్న కంపెనీలో సరైన వేతనం లభించక కుటుంబాన్ని పోషించడం భారంగా మారింది. దీంతో మనస్తాపానికి గురైన లచ్చన్న వారంక్రితం తాను ఉంటున్న గదిలో ఉరేసుకున్నాడు. గల్ఫ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు గుండెల్లి నరసింహ, ఎన్‌ఆర్‌ఐ పాలసీ అడ్వైజరీ కమిటీ ఉపాధ్యక్షుడు మంద భీంరెడ్డి సహకారంతో ఆయన మృతదేహం ఇంటికి చేరింది. విగతజీవిగా వచ్చిన లచ్చన్నను చూసిన కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల రోదనలు మిన్నంటాయి. లచ్చన్నకు భార్య లత, ఇద్దరు కుమారులున్నారు.

మందుపాతరల గణేశ్

- లెంకలగడ్డ బ్లాస్టింగ్ దేశవ్యాప్తంగా సంచలనం
- శాంతిచర్చల్లో పీపుల్స్‌వార్ పార్టీ ప్రతినిధిగా బాధ్యతలు
- మూడు దశాబ్దాలకుపైగా ఏకే 47తోనే చెలిమి



గాజర్ల రవి ఉరఫ్ గణేశ్ (ఫైల్)

మంథని: గోదావరి పరివాహక ప్రాంతంలోని నల్లరేగడి భూముల్లో నక్సల్‌బరి విత్తనాలు మొలకెత్తిన తొలినాళ్లలో వరంగల్ రాడికల్ యువజన సంఘం ఉద్యమాల నుంచి అడవిబాట పట్టిన గాజర్ల రవి ఉరఫ్ గణేశ్ చిన్నవయసులోనే పలు విధ్వంసాలు సృష్టించి కేంద్ర కమిటీ మన్ననలు పొందారు.

దేశంలోనే సంచలనం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాల గ్రామానికి చెందిన గాజర్ల రవి ఉరఫ్ గణేశ్ 1992లో అజ్ఞాతంలోకి వెళ్లారు. 1993లో ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల పరిధిలోని మహాదేవపూర్, ఏటూరునాగారం పీపుల్స్‌వార్ పార్టీ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. ఉద్యమాన్ని బలోపేతం చేస్తూనే వర్గ శత్రు నిర్మూలనకు ప్రాధాన్యతనిచ్చారు. 1994 శాసనసభ ఎన్నికల టైంలో మంథని నియోజకవర్గంలోని మహాదేవపూర్ మండలం లెంకలగడ్డ వద్ద శక్తివంతమైన బాంబులు అమర్చి 9 మంది పోలీస్ అధికారులను హతమార్చడంలో కీలకపాత్ర పోషించాడు. ఈ ఘటనలో ఐపీఎస్ ఐజీ స్థాయి అధికారి సాహితోపాటు ఐదుగురు పంజాబ్ కమాండోలు, మహాదేవపూర్ ఎస్సై వెంకటస్వామి సహా తొమ్మిది మంది మరణించారు. అప్పటి నుంచి సాహి లెంకలగడ్డ బ్లాస్టింగ్‌లో మరణించడం దేశవ్యాప్తంగా సంచలనం అయింది.

కీలకనేతగా ఎదిగిన గాజర్ల

లెంకలగడ్డ బాంబు బ్లాస్టింగ్ అనంతరం గణేశ్ అప్పటి పీపుల్స్‌వార్ పార్టీలో అత్యంత కీలకనేతగా ఎదిగారు. మందుపాతరలు పేల్చడం, ఏకే–47లో వినియోగించడంలో గణేశ్‌కు మరొకరు సాటిలేరు అనే ప్రచారం ఉండేది. గణేశ్ తెగువను, సమర్థవంగా అమలు చేసే వ్యూహాలను పసిగట్టిన అప్పటి పీపుల్స్‌వార్ పార్టీ రాష్ట్ర, కేంద్ర నాయకత్వాలు ఆయనను రాష్ట్ర సభ్యుడిగా నియమిస్తూ ఉత్తర తెలంగాణ వ్యవహారాలను అప్పగించింది. ఆ తర్వాత 1999లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో మహాముత్తారం మండలం కనుకునూర్‌కు రీపోలింగ్‌కు బందోబస్తుకు వెళ్తున్న పోలీస్ సిబ్బందిపై దొబ్బలపాడు కల్వర్టు వద్ద బాంబు బ్లాస్టింగ్ చేసిన ఘటనలో 10 మంది పోలీసులు మృత్యువాత పడ్డారు. భూపాలపల్లి సమీపంలోని బాంబుల గడ్డ వద్ద పేల్చివేత వంటి సంఘటన కూడా అప్పట్లో సంచనల సృష్టించింది. 2002లో మహాదేవపూర్ పోలీస్‌స్టేషన్‌ను పేల్చడానికి బస్సును బాంబుగా అమర్చి సరికొత్త వ్యూహంతో సంచలనం సృష్టించాడు. ఆ తర్వాత ఏవోబీ ఆంధ్రా–ఒడిశా బార్డర్‌కు కార్యదర్శిగా నియమించారు. ఇలాంటి ఎన్నో సంఘటనల్లో గణేశ్ పాత్ర ఉండేది. ఆ తర్వాత పార్టీ నాయకత్వం ఆయనను కేకేడబ్ల్యూ(కరీంగర్, ఖమ్మ, వరంగల్) కార్యదర్శిగా నియమించింది. కొన్ని సంవత్సరాలు తర్వాత రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగి ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖరరెడ్డి ఉన్న సమయంలో ప్రభుత్వంతో జరిగిన శాంతిచర్చల్లో పీపుల్స్‌వార్ పార్టీ ప్రతినిధుల బృందంలో గణేశ్ చర్చల ప్రతినిధిగా పాల్గొన్నారు.

మూడు దశాబ్దాలకుపైగా ఏకే–47

మహాదేవపూర్ ఏరియా కార్యదర్శిగా పనిచేసిన సమయంలో ఏకే47 తుపాకీతోనే ఆయన స్నేహం కొనసాగింది. అనేక హింసాత్మక సంఘటనలకు పాల్పడిన గణేశ్ ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు కంటి మీద కునుకులేకుండా చేశారు. ఆంధ్రా, ఒడిషా సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో గణేశ్ చనిపోయినప్పుడు ఏకే–47తోనే కనిపించాడని ఆయనతోపాటు పనిచేసిన మాజీ మిలిటెంట్లు కొందరు చర్చించుకుంటున్నట్లు సమాచారం.

దుమాల గురుకులం ప్రిన్సిపాల్ సస్పెన్షన్

- మరిమడ్ల ప్రిన్సిపాల్‌కు బాధ్యతలు



ప్రిన్సిపాల్ మంజిత్‌తో మాట్లాడుతున్న లంబాడ హక్కుల పోరాట సమితి నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాజన్న సిరిసిల్ల ఎల్లారెడ్డిపేట మండలం దుమాల ఏకలవ్య గిరిజన గురుకులం పాఠశాల ప్రిన్సిపాల్ మంజిత్‌ను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర గురుకులాల కార్యదర్శి సీతాలక్ష్మి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం తాత్కాలికంగా కోనరావుపేట మండలం మరిమడ్ల గురుకులం ప్రిన్సిపాల్ రాము సూరత్‌యాదవ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. విధులపై నిర్లక్ష్యం, ఉన్నతాధికారుల ఆర్డర్ల అమలులో బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించడంతోనే వేటు పడింది. పాఠశాలలో పనిచేస్తున్న నలుగురు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను మూడు రోజుల క్రితం విధుల నుంచి తొలగించడం.. గురుకులాల ఉన్నతాధికారులు ఇచ్చిన ఆర్డర్‌ను పట్టించుకోకుండా వ్యవహరించడాన్ని సీరియస్‌గా పరిగణిస్తూ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి

గత 20 ఏళ్లుగా గురుకులంలో పనిచేస్తున్న నలుగురు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు భూక్య గజన్‌లాల్ డిమాండ్ చేశారు. నాయకులు మాలోత్ కిరణ్‌నాయక్, గుగులోత్ రవినాయక్ ఉన్నారు.

మద్యం మత్తులో కారు డ్రైవింగ్

యువకుడి మృతి.. డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్‌లో డ్రైవర్‌కు 219 పాయింట్లు



కుర్మ నరేశ్ (ఫైల్)



వాహనదారులను హెచ్చరిస్తున్న మద్యం తాగిన యువకుడు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మద్యం మత్తులో కారును నడిపి ఓ నిండు జీవితాన్ని బలితీసుకున్నాడు. ప్రమాదం చేసిందే కాకుండా కావాలంటే పదేళ్లు జైలుకు పోతా.. నన్ను ఏమి చేయలేరంటూ వాహనదారులపై చిందులు వేశాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు. వేములవాడ మండలం చింతలఠాణా ఆర్‌అండ్‌ఆర్ గ్రామానికి చెందిన కుర్మ నరేశ్(38) బైక్‌పై గురువారం జక్కాపూర్ వెళ్తున్నాడు. ఈక్రమంలోనే నేరెళ్ల శివారులో సిద్దిపేట నుంచి తంగళ్లపల్లి వైపు కారు అతివేగంగా రాంగ్‌రూట్లో వచ్చి ఢీకొట్టింది. దీంతో నరేశ్ తలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108లో సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. కారు నడిపిన యువకుడు మద్యం మత్తులో ఉండి ప్రశ్నించిన వాహనదారులపైకి చిందులు వేశాడు. పదేళ్లు జైలుకు పోతానంటూ వాగ్వాదానికి దిగాడు. కారు డ్రైవింగ్ చేసిన యువకుడికి బ్రీత్ అనలైజర్ టెస్టు నిర్వహించగా 219 పాయింట్లు వచ్చింది. మృతుడి అన్న కుర్మ రాజేశం ఫిర్యాదుతో తంగళ్లపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతు భరోసా పంపిణీ

- జిల్లాలో రైతులు 1,22,516
- మొత్తం సాయం రూ.85,94,01,801



సుల్తానాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తోంది. ఇప్పటికే మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణం, కరెంట్, సబ్సిడీ ద్వారా గ్యాస్, మహిళలకు రూ.15లక్షల వరకు రుణాలు, ఉచిత రేషన్ బియ్యం పంపిణీతోపాటు వానాకాలం సీజన్లో సన్న వడ్లకు క్వింటాలుకు బోనస్ రూ.500ను రైతు ఖాతాలో నేరుగా జమ చేసింది. ఇటీవల రైతు భరోసా పథకాన్ని ప్రారంభించింది. పథకం ద్వారా పంట పెట్టుబడి కోసం రైతులకు నేరుగా ఆర్థిక సాయమందిస్తారు. దీని ద్వారా రైతులు విత్తనాలు, ఎరువులు ఇతర వ్యవసాయ ఖర్చుల కోసం ఇతరులపై ఆధారపడకుండా తమ అవసరాలను తీర్చుకోగలుగుతారు.

రైతు ఖాతాలో జమ

జిల్లాలో రైతు భరోసా పెట్టుబడి సాయం రైతుల ఖాతాలో జమ చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి తెలిపారు. వానాకాలం 2025–26 సంవత్సరం మంగళవారం నాటికి జిల్లాలో 1,01,397 మంది రైతులకు రూ.54,70,63,881 ఖాతాల్లో జమ కాగా.. బుధవారం 21,119 మంది రైతుల ఖాతాల్లో రూ.31,23,37,920 జమ చేసినట్లు వివరించారు. జిల్లాలో మొత్తం 1,22,516 మంది ఖాతాలో రూ.85,94,01,801 జమైనట్లు తెలిపారు.

20 లోపు..

ఈనెల 20 లోపు నూతనంగా వచ్చిన రైతులందరూ రైతు పట్టాదారు పాసు పుస్తకంతోపాటు మీసేవకు లింకైన ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ నంబర్‌ను సంబంధిత ఏఈవోలకివ్వాలి. లింకైన తర్వాత వారికి సైతం వారివారి ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు పడనున్నాయి.

ఎన్నికల ప్రభావం

సాధారణంగా ఎన్నికలకు ముందు ప్రభుత్వాలు ఇలాంటి ప్రజాకర్షణ పథకాలను అమలు చేయడం చూస్తుంటాం. ఓటర్లను ఆకట్టుకోవడానికి.. తమ ఓటు బ్యాంకును పటిష్టం చేసుకోవడానికి ఇది ఒక వ్యూహాత్మక చర్యగా భావిస్తారు. రైతు భరోసా పథకం మెజారిటీ ఓటర్లయిన రైతులను లక్ష్యంగా చేసుకున్నందున.. ఇది రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వానికి గణనీయమైన ప్రయోజనాన్ని చేకూరుస్తుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

మండలాలవారీగా రైతుల ఖాతాల్లో జమైన నిధులు

మండలం	రైతుల సంఖ్య	రూపాయలు
కమాన్‌పూర్	4,688	3,16,79,164
మంథని	12,016	9,20,43,408
ముత్తారం	6,416	5,16,22,052
రామగిరి	4,817	3,56,46,250
ఎలిగేడు	5,982	4,10,53,524
జూలపల్లి	8,526	5,71,12,773
ఓదెల	11,119	8,24,29,519
పెద్దపల్లి	17,461	11,84,86,340
శ్రీరాంపూర్	10,812	8,40,45,947
సుల్తానాబాద్	13,174	8,73,66,114
అంతర్గాం	4,770	3,24,87,052
ధర్మారం	14,770	9,45,22,267
పాలకుర్తి	6,362	4,19,08,842
రామగుండం	1,603	89,98,549

రైతు ఖాతాలో జమ



జిల్లావ్యాప్తంగా ఉన్న రైతులందరికీ ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమవుతున్నాయి. సోమవారం రాత్రి నుంచి 5 గుంటలు మొదలుకొని రెండు ఎకరాల విస్తీర్ణం వరకున్న వారికి జమయ్యాయి.

– ఆదిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి, పెద్దపల్లి

పెట్టుబడికి దోహదం



రైతు భరోసా డబ్బులు ఖాతాలో జమయ్యాయి. పెట్టుబడి సాయానికి దోహదపడనున్నాయి. ప్రభుత్వం నిర్ణయం హర్షణీయం. ప్రభుత్వానికి రైతులు అండగా నిలుస్తారు.

– గరిగే శ్రీనివాస్, రైతు, సుల్తానాబాద్

విశిష్టత తెలిపేలా యోగా దినోత్సవం నిర్వహణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న యాదగిరి శేఖర్ రావు, గౌతంరావు

కరీంనగర్‌కల్చరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని వికాస తరంగిణి, ప్రజ్ఞావికాస్ ఆధ్వర్యంలో కరీంనగర్ మహాత్మ జ్యోతిరావు పూలే సర్కస్ గ్రౌండ్‌లో శనివారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు త్రిదండి రామానుజ జీయర్ స్వామివారి మంగళాశాసనాలతో దేవనాథ రామానుజీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో యోగా విశిష్టత తెలిపేలా యోగా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ప్రజ్ఞావికాస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్ రావు, వికాస తరంగిణి జోనల్ అధ్యక్షుడు గౌతంరావు తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతీరోజు విద్యార్థులకు యోగా నేర్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, విద్యార్థులకు విలువలతో కూడిన విద్య,కుటుంబ విలువలు, కుటుంబ ప్రాముఖ్యత అర్థమయ్యే విధంగా తెలియజేస్తామన్నారు. సమావేశంలో వికాస తరంగణి, ప్రజ్ఞా వికాస్ ఆధ్వర్యంలో యాద కిషన్, సిరికొండ వెంకటేశం, రవీందర్ రావు, ప్రభాకర్ రావు, కర్ణాకర్ రావు, జగన్నాథరావు, ప్రతాప్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మానేరు రివర్‌ఫ్రంట్ పనులపై విచారణ జరపాలి



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న చాడ వెంకటరెడ్డి

కరీంనగర్: నగరంలోని మానేరు రివర్ ఫ్రంట్ పనుల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరపాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి వినతిపత్రం అందించారు. మానేరు రివర్ ఫ్రంట్ అభివృద్ధి పేరుతో గత ప్రభుత్వం రూ. 500 కోట్లు మంజూరు చేసిందని, అందులో టూరిజం శాఖ రూ. 100 కోట్లు, నీటి పారుదల శాఖ రూ. 100 కోట్లు నిధులు విడుదల చేసిందన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహించారని తెలిపారు. పనులు పూర్తికాకుండానే బిల్లులు చెల్లించారన్నారు. చెక్ డ్యాములు నిర్మిస్తే వర్షాలకు పూర్తిగా కొట్టుకుపోయాయని, ఐదేళ్లు గడుస్తున్నా పనులు పూర్తికాలేదని ఆయన సీఎంకు వివరించారు.